క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్ఐ గిరి

యువత క్రీడల్లో రాణించాలి

పెద్దేముల్, మే 25 : యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని పెద్దేముల్ మండల ఎస్ఐ కె.గిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో నిర్వహించిన అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.గిరి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని, క్రీడలతో మానసికోల్లాసంతోపాటు దేహధారుఢ్యం పెంపొందుతుందన్నారు. అనంతరం ఆర్గనైజర్లు ఎస్ఐని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సల్మాన్, రహీం, బాబర్, సద్దాం, గయాజ్, జావిద్, పడగాళ్ల రవీందర్, తన్వీర్, అలీబాబా, జమీర్, సమీర్, డీవై ప్రసాద్, మాధవరెడ్డి, బంగ్ల రఘు, ప్రవీణ్, చిన్న, అశోక్‌గౌడ్, వెంకట్, అంబి, భీమేశ్, రాము, సిహెచ్.వెంకట్, ఇస్మాయిల్, మైమూద్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

దోమ, మే 25 : గ్రామ పంచాయతీల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ నేటికీ బిల్లులు రాలేదని, వెంటనే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేయాలనే కాక్షతో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు తదితర పనులను విడతల వారీగా చేపట్టి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనర్‌కు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తరపున పార్థసారథికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణకు కృషి

పల్లె ప్రకృతివనంలో మొక్కలకు పాదులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కులకచర్ల, మే 25 : హరితహారం కింద నాటిన మొక్కల సంరక్షణకు కృషిచేస్తున్నామని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కులకచర్ల మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలకు పాదులు చేయించి చెట్ల చుట్టు ఉన్న చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో చెట్లు ఎండిపోకుండా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

మన్సూరాబాద్, మే 25: కాలనీలో ఉన్న పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు చుట్టూరా ప్రహ గోడలను నిర్మిస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధి లక్ష్మీభవానీలోని పార్కు స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీగోడ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం బృందావన్‌కాలనీలో పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కాలనీ నుంచి మొదలైన ట్రంక్‌లైన్ పనులు కొన్ని కారణాల వలన అర్ధాంతరంగా ఆగిపోయాయని.. హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ అధికారులతో మాట్లాడి సదరు పనులను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రాజు, ఏటీఓ విశ్వనాథ్, నర్సింగ్‌రావు, కాలనీవాసులు నవీన్‌రావు, నరేంద్రకుమార్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

నవాబుపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

నవాబుపేట, మే 25 : డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. శనివారం నవాబుపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులు విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లుజుగా ఉన్న విత్తనాల సంచులు తీసుకోరాదని గుర్తుజేశారు. తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీల్లర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ వికారాబాద్ వినోద్, ఏఈవో రమేశ్, మండల వ్యవసాయ అధికారులు ప్రసన్నలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

ధారూరు : రైతులు ప్రభుత్వం అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని ధారూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీలక్ష్మిబాయి అన్నారు. శనివారం ధారూరు మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కూలీలు, రైతులకు విత్తనాల కొనుగోలుపై రైతులు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ధారూరు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పకుండా వ్యవసాయ శాఖ అధికారుల సలహా, సూచనలు పాటించాలని తెలిపారు. రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో లైసెన్సు జారీ చేసిన దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా విత్తనాలు అమ్ముకానికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్రతి డీలర్ షాపులో 12కాలమ్స్ ప్రోఫార్మ రిజిస్టరు పెట్టడం జరిగిందని, అందులో విత్తనాల వివరాలు పొందు పరుచాలని తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి సంజు రాథోడ్, ఏపీవో సురేశ్, ప్రభాకర్ గౌడ్, సతీశ్, పావని రైతులు ఉన్నారు.

ధారూరులో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీలక్ష్మీబాయి, ఏఈవో సంజూరాథోడ్

కమాల్‌పూర్, లక్ష్మీనారాయణపూర్‌లో..

యాలాలా మండల పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు రుద్రమూర్తి

యాలాల : విత్తన కొనుగోలు విషయంలో జాగ్రత్తలు అవసరమని సహాయ వ్యవసాయ సంచాలకుడు రుద్రమూర్తి, మండల వ్యవసాయాధికారి యాదగిరి అన్నారు. శనివారం మండల పరిధిలోని కమాల్‌పూర్, లక్ష్మీనారాయణపూర్ గ్రామాల్లో విత్తన కొనుగోలు విషయంలో తీసుకోవాలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేణుగోపాల స్వామి ఆలయ సందర్శన

పరిగి, మే 25 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను స్థానికులు కోరడంతో ఆలయ పరిస్థితి తెలుసుకునేందుకు రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ తులసీరాం ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఆలయం నిర్మాణంతోపాటు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టాలని జేఏసీ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్‌కు విన్నవించారు. ఈ విషయమై కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ పరిస్థితిపై ఏఈ తులసీరాంను అధికారులు నియమించగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. పూర్తిస్థాయి వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందిస్తామని ఏఈ తులసీరాం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నాగేశ్వర్, నాయకులు రాముయాదవ్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించిన ఏఈ తులసీరాం

గౌడ సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆర్కేపురం, మే 25 : బాలాపూర్ మండల గౌడ సహకార సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గిరుకటి కృష్ణంరాజ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ముప్పిడి ధన్‌రాజ్‌గౌడ్, డైరెక్టర్లుగా తూళ్ళ మల్లేశ్ గౌడ్, రంగ నాగేశ్ గౌడ్, జూకంటి సురేశ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాలాపూర్ మండలంలో గౌడ సహకార సంఘం బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు. గౌడ సంఘం కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన గౌడ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీధినాటకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

చౌడాపూర్‌లో వీధినాటక కళాకారులను అభినందిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, మే 25 : వీధినాటకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి చౌడాపూర్ మండల కేంద్రంలో భక్త శిరియాల వీధినాటకంలో పాల్గొన్న ఆయన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధినాటకాలకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ఆయన వెంట చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, మండల ఉపాధ్యక్షుడు రాములు, వెంకట్, ఆంజనేయులు, కళాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

చెరువుముందలితండాలో పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

కులకచర్ల, మే 25 : పాఠశాలల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని నేరెళ్ల కుంట తండా పాఠశాల, చెరువుముందలితండా(ఎ) పాశాల, ఎత్తుకాల్వ తండా పాఠశాల, ఇప్పాయిపల్లితండా పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు నెల30వరకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, చైర్ పర్సన్లు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులది కీలకపాత్ర

పరిగి, మే 25: ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులది కీలకపాత్ర అని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ పవిత్ర పేర్కొన్నారు. శనివారం పరిగిలోని ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించి ప్రగతిచక్ర అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు చక్కటి పనితీరు కనబరిచి ఉత్తమ సేవలు అందించడం ద్వారానే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులను గుర్తించి ప్రగతిచక్ర అవార్డులు అందించినట్లు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి 56 మందికి అవార్డులు ప్రదానం చేశారు.



హనుమాన్ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలి

ఆర్కేపురం, మే 25 : ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేనిన్‌నగర్ హనుమాన్ దేవాలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో తస్కరించారు. ఆలయ చైర్మన్ రాజుగౌడ్, ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జటావత్ శ్రీనునాయక్, దిండు భూపేశ్ గౌడ్, రాజ్‌కుమార్, మోహన్‌నాయక్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎల్బీనగర్, మే 25: కొత్తపేట డివిజన్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు వినతి పత్రం సమర్పించారు. కొత్తపేట డివిజన్‌లోని ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధాన రోడ్డులో వరదనీటి కాలువ పనులు అర్ధాంతరంగా, అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తి చేసి నూతన రోడ్డు వేయాలని, అదే విధంగా సత్యనగర్, రాఘవేంద్ర కాలనీ, భరత్‌నగర్ ఫేజ్-1,2, రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్-1,2 ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను పూర్తి చేసిన అధికారులు ఆ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు చేపట్టలేదని ఆరోపించారు.

కందుకూరు రైతు వేదికలో రైతులకు సలహాలు ఇస్తున్న అధికారులు

రైతు వేదికలే దిక్సూచి

- పంటల సాగుపై గ్రామస్థాయిలో చర్యలు
- అందుబాటులో ఏఈవోలు
- సాగుపై రైతులతో సమాలోచనలు
- ఇతర పంటలపై అవగాహన
- నెరవేరిన మాజీ సీఎం కేసీఆర్ ఆశయం

క్షేత్రస్థాయిలో పంట పరిశీలన..

రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఒక్కో రైతు వేదికలో ఒక వ్యవసాయ విస్తరణ అధికారి ఉంటున్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. వారానికి ఒకసారి రైతు వేదికలో సమావేశాలు నిర్వహిస్తున్నాం. పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో సూచిస్తున్నాం.

– లావణ్య, మండల వ్యవసాయ అధికారి కందుకూరు

కందుకూరు, మే 25: ఒకప్పుడు వ్యవసాయ అధికారి ఎక్కడుంటాడో తెలిసేది కాదు. ఏదైనా సమస్య వస్తే ఎవరిని కలువాలో.. ఎక్కడ కలువాలో తెలిసేది కాదు. ఇదంతా ఉమ్మడి రాష్ట్రంలో పరిస్థితి. కానీ తెలంగాణ ఏర్పడిన అనంతరం ఇప్పుడు వ్యవసాయ అధికారి ఎక్కడున్నడని అడిగేతే.. రైతు వేదికలో అనే సమాధానం వినిపిస్తున్నది. రైతులను సంఘటితం చేయాలనే మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం కార్యరూపం దాల్చుతున్నది. ఈ విధంగా రైతులను సంఘటితం చేసేందుకు రైతు వేదికలను నిర్మించడం దేశంలోనే తొలిసారి కావడం గమనార్హం. గతంలో సాగుపై రైతులకు సూచనలు ఇచ్చేవారే కరువు. కానీ ఇప్పుడు ప్రతి గ్రామానికో ఏఈవోను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించింది. దీంతో సాగులో ఎలాంటి సందేహం వచ్చినా ఏఈవోను సంప్రదించి పరిష్కరిచుకొనే అవకాశం లభించింది.

రైతు వేదికలను వేదికగా చేసుకొని రైతులు, అధికారులు పంటల సాగుపై సమాలోచనలు చేస్తున్నారు. ఎలాంటి పంటలు వేయాలి? ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి? ఏ పంటలకు డిమాండ్ ఉన్నది? ఏ విత్తనాలు బాగుంటాయి? వంటి అంశాలపై ఏఈవోలతో చర్చించి రైతులు నిర్ణయం తీసుకొంటున్నారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో రైతులు సంతోషపడుతున్నారు.

మట్టి దిబ్బలను మరిచారు..

చంపాపేట రోహిణి హాస్పిటల్ ముందు రోడ్డును తవ్వి.. మట్టి దిబ్బలు అక్కడే వదిలేసిన దృశ్యం

చంపాపేట, మే 25: చంపాపేట డివిజన్ పరిధి ఎస్‌జీఆర్ కాలనిలోని రోహిని హాస్పిటల్ ముందు పైపులైన్ మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని రోజుల క్రితం వీధి రోడ్డును తవ్వారు. తవ్విన చోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోగా.. తవ్విన మట్టిని అక్కడి నుంచి తరలించడం మరిచారు. దీంతో కాలనీకి రాకపోకల సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో నిత్యం ఈ రోడ్డు మార్గం వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

నాలాల వద్ద పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలి

నాలాకు రక్షణగా ఏర్పాటు చేసిన కంచెను పరిశీలిస్తున్న జడ్సీ స్నేహ శబరీష్

మియాపూర్, మే 25: వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. అత్యంత ప్రధానంగా నాలాల వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలాలను జడ్సీ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. జడ్సీ మాట్లాడుతూ..జోన్ పరిధిలోని 4సర్కిళ్లలో ఉన్న నాలాలన్నింటికీ మూడువైపులా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, నాలాలకు సూచికగా బోర్డులను, ఫ్లెక్సీలను విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో వర్షాలు భారీగా పడే అవకాశం ఉన్నందున నాలాలు, మ్యాన్ హోల్స్ వద్ద తగు చర్యలు చేపట్టాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సమ్మెతో నాలాల్లో డీసిల్టింగ్ ప్రక్రియ నిలిచిపోవడంతో ఆ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు విన్నవించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం సహా ఇతర విభాగాలు సమన్వయంతో పని చేస్తూ వరద నీటి సమస్యల్లేకుండా చూడాలని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని జడ్సీ ఆదేశించారు. జడ్సీ వెంట ఈఈ శ్రీనివాస్, ఇతర అధికారులున్నారు.

స్వచ్ఛతపై అవగాహన

గచ్చిబౌలి డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు

శేరిలింగంపల్లి, మే 25 :స్వచ్ఛతపై నిర్లక్ష్యం వద్దని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో స్థానికులకు ప్రత్యేకంగా అవగాహన నిర్వహించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పడవేయరాదని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ జలంధర్ రెడ్డితోపాటు పలువురు ఎస్ఎఫ్ఎలు, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

కొండాపూర్, మే 25 : అన్నమాచార్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కళాకారులు ఆలపించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు, నృత్యాభినయాలతో ఆద్యాంతం అలరించారు. అకాడమీకి చెందిన 90 మంది కళాకారులు తమ గాత్ర, నృత్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. ఉత్సవాలలో టీవీ నటులు పీవీ ప్రదీప్, సరస్వతి, కళాకారిణి ఆశిత వేముగంటి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోస్యభట్ల తదితరులు హాజరై కళాకారులను అభినందించారు.